195

# కొలవరాని దూరం

బెనారస్ నించి ఢిల్లీ, ఢిల్లీ నించి మద్రాసు. విమానంలో వచ్చినా తరగనంత దూరం. కాలం నడవదు. విమానం ఎద్దు బండిలా మెల్లగా. కింది కొండలు నదులు అడవులు అతిమెల్లగా పాకుతున్నాయి వెనక్కి, తాపీగా.

"తనువులు ఎంత చేరువైనా - మనసులు దూరం:
మనసులు చేరువైననాడు - మనుగడ ఒక వరం"

రాజా అప్పుడప్పుడు రాసిన కవితలలో రెండు పంక్తులు. నాకూ రాజాకీ తనువులూ మనసులూ చేరువైన క్షణాలూ దూరమైన యుగాలు ఎన్నో.

ఇప్పుడు రాజా శవం, తాము ఇద్దరూ కూర్చుని, సంప్రతించుకుని, కొట్లాడుకుని, కోరుకుని కట్టించుకున్న ఇంట్లో, తనకోసం వేచి ఉంది. డ్రై ఐస్‌లో పెట్టి ఉంచారట. డాక్టర్ నటరాజన్ సుదీర్ఘమైన టెలిగ్రాం.

చటుక్కుని విమానంలో ఉక్క. ఊపిరి సలపని ఉక్క. ఎదటి సీటు వెనక సంచీలోంచి కాగితపు విసనకర్ర తీసి విసురుకోవాలని ప్రయత్నం. మెదడు ఆజ్ఞ చేతులు పాటించలేదు. ముఖాన్ని చెమటలు కనబడ్డట్టున్నాయి. హెూస్టెస్ వంగి - కుడిపక్క

మూడింట్లో మధ్యసీట్లో ఉన్నాను నేను - "ఒంట్లో బాగాలేదా" అని అడిగింది. 'మంచినీళ్ళు' అన్నాను. తాగిన మనిషిలా తూలుతూ తొందరగా వెళ్ళింది హొస్టెస్. నా ఎడంపక్క ఒక వయసు వాల బోతున్న పెద్దమనిషి, కష్టాల్లో ఉన్న కన్యకామణిని కాపాడ్డానికి లాగ, 'వర్రీ కాకండి. మొదటిసారి విమానం ఎక్కితే అలాగే ఉంటుంది. ఉండండి, నాదగ్గర మాత్ర ఉంది' అంటూ తన బ్రీఫ్ కేస్ కాళ్ళమీద పెట్టుకుని తెరిచాడు.

మొదటిసారి విమానం ఎక్కితే!: నవ్వాలనిపించింది. కాని నవ్వు రాలేదు. రాబోయి గొంతు కింద అణగిపోయింది. రాజా నన్ను తన ట్రెయినర్ ప్లేన్‌లో ఎక్కించుకుని, నన్ను సీటుకి బెల్టు లతో బంధించి, తలకిందుగా పల్టీలు కొట్టించాడు, ఎన్నోసార్లు. అప్పుడు అలహాబాద్‌లో పైలట్ ట్రెయినర్‌గా ఉండేవాడు - నేను బెనారస్‌లో చదువుతున్నప్పుడు - పది పన్నెండు ఏళ్ళక్రితం.

మాత్ర మాత్రం వద్దన్నాను. మంచినీళ్లు తాగి హొస్టెస్‌కి 'థాంక్స్' చెప్పాను. తాగినమనిషిలా తూలుతూ వెళ్ళిపోయింది ఆమె.

అప్పుడు ఇలాగే శెలవలకి ఇంటికి వెడుతున్నాను. ఢిల్లీలో ప్లేన్ ఎక్కాను. ఇలాగే కుడిపక్క మూడింట్లో మధ్యసీట్లో నేను. బెల్టు కట్టుకున్నాను. గాంగ్‌వే పక్క సీటుకాళీ. ప్లేన్ ఎగరబోతోంది. రాజా వచ్చి అందులో కూర్చున్నాడు - మీకేమీ అభ్యంతరం లేదుగదా - అంటూ. నేను ఏమీ అనకముందే అభ్యంతరం లేదని నిర్ణయించుకున్నవాడిలా నావంక తిరిగి చిరునవ్వు నవ్వాడు. మద్రాసు వచ్చేదాకా లేవలేదు. పైగా ఆ రెండు మూడు గంటలూ ఏవో మాట్లాడుతూనే ఉన్నాడు. తను రాజా. అలహా బాద్‌లో పైలట్ ట్రెయినింగ్ కేంద్రం ఉంది. అందులో అతను ట్రెయినర్. మూడురకాల విమానాలు నడపగలడు. ఒక్కొక్క రకానికి ఇంచుమించు 150 గంటల అనుభవం ఉంది. అలహా బాద్ అడ్రస్ చెప్పాడు. మద్రాసు అడ్రస్ చెప్పాడు. అదీగాక,

మద్రాసులో దిగగానే నా బాగేజ్ చెక్ తీసుకున్నాడు, ఇంచుమించు బలవంతంగా. నేను టాక్సీ కోసం చూస్తూంటే, నా జబ్బ పట్టుకుని ఏర్‌పోర్ట్‌వాళ్ల వాన్‌లో ఎక్కించాడు. మా ఇంటి దగ్గర దింపాడు. నాకు ఒక పక్క తిక్క, ఇంత చనువు తీసుకుంటూంటే. ఒకపక్క ఏదో తెలియని ఆందోళన, ఇష్టంకూడా. రవంత గర్వకూడా.

ఏర్‌పోర్ట్ వాన్‌లో వెనకసీట్లో నేనూ అతను కూర్చున్నాం. అప్పుడు చటుక్కుని, అకస్మాత్తుగా మబ్బులేని పిడుగులా చెప్పాడు. తను నాపక్కని కావాలనే వచ్చి కూర్చున్నాట్ట. నేను బనారస్‌లో చదువుతున్నట్టు తెలుసట. నేను అందమైనదాన్నని ఉపోద్ఘాతం మొదలుపెట్టాలనుకున్నాట్ట. అది మరీ చచ్చురకం చవకబారు కుర్రపద్ధతి అని తోచి మానుకున్నాట్ట. నేనతనికి నచ్చానట. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటే అదీ కుర్రతనంగానే ఉంటుంది గనుక అనలేదట. ఇంటి దగ్గర దిగుతుంటే నా మనసులో: వట్టి వాగుడు కాయ, కాని దాపరికాలు ఎరగడు. అయినా మొట్టమొదటిసారి ఒక ఆడపిల్లను కలుసుకున్నప్పుడు ఇలా మాట్లాడే మనిషి ఎలాంటి వాడు? ఆడపిల్లల్ని వల్లో వేసుకోడంలో మంచి అనుభవం ఉన్నట్టుంది. వట్టి జులాయిమనిషి లాగున్నాడు. కాని అన్యాయం చేస్తున్నానేమో. అయితే ఏం. ఇంత మగతనపు గర్వం, అహంకారం ఉన్న మనిషికి నేనెందుకు చనువిస్తాను? మర్నాడు ఎలాగా ఇంటికి తయారవుతాడు, ఏదో వంక పెట్టుకుని. అప్పుడు నిలబెట్టి కడిగేస్తాను.

అతను రాలేదు. మర్నాడు కాదుగదా, నా శెలవలు అయిపోయిందాకా. బీచ్‌లో, షాపుల్లో, హోటళ్ళలో నా కళ్ళు అతని కోసం వెతుకుతూనే ఉన్నాయి. కనబడితే కడిగి పారెయ్యడానికి, కనబడలేదన్న దిగులుతో, చిరాకుతో. ఎందుకు కనబడలేదన్న కోపంతో. మళ్ళీ, శెలవులు అయిపోయి, బెనారస్ వెళ్ళి, ఆడవాళ్ల హాస్టల్ అనబడే మహా బందిఖానాలో నా గది చేరుకునేదాకా అతనికోసం ఎదురుచూస్తూనే ఉన్నాను. రాడని నిర్ణయించుకున్న

తరువాత మనసులో బరువు తరిగిపోయినట్టు అనిపించింది. కాళీ అయిపోయినట్టు అనిపించింది. కాళీ అయిపోయినట్టు, సుఖంగా ఉన్నట్టుకూడా.

అతన్ని ఇంచుమించు మరచిపోయాను. యంత్రంలాగ కాలేజ్‌కి వెళ్ళి వస్తున్నాను. సాటి ఆడపిల్లలతో కుర్రాళ్ళని గురించి చర్చలు, సాయంకాలం యూనివర్సిటీ రోడ్ల వెంట షికార్లు. అప్పుడప్పుడు పట్నంలో సినిమాలు, చదువులు, పరీక్షలు - అప్పుడొచ్చాడు - పరీక్షలు అవుతుంటే. ఇంగ్లీషు రెండో పేపరు బాగా రాశానన్న తృప్తి, గర్వం, మిగతావాళ్ళ ముందు ప్రదర్శిస్తూ, హాస్టల్లో అడుగుపెట్టేసరికి, అక్కడున్న అవ్వ చెప్పింది - 'మీ బంధువట నాకోసం వచ్చాట్ట. విజిటర్స్ గదిలో ఉన్నాట్ట - ఉత్తరం, కబురు, ఏమీలేకుండా నన్ను చూడ్డానికి వచ్చిన 'బంధువు' ఎవరా అను కుంటూ లోపలికి వెళ్ళాను. రాజా: నాకోసం అలహాబాదు నించి బైప్లేన్ తెచ్చానన్నాడు. వెటకారంగా నవ్వాను. అతను అనుకునే టంత అమాయకురాలిని కానన్నాను. మొగాడు కన్నుగీటగానే పడిపోయేటంత వెర్రిదాన్ని కానన్నాను. పరీక్షలు, బాధ్యత, తెలిసినదాన్ని. గుడ్‌బై అన్నాను గాని కదల్లేదు. అతడు దెబ్బతిన్న కుక్కలా వెళ్ళిపోతాడని ఆశ. మెత్తగా నవ్వుతూ అన్నాడు - పరీక్ష పోతే ఏమని. చర్రున వెళ్ళిపోయాను - నాగర్వం అంతా ప్రదర్శిస్తూ.

మొహం కడుక్కొని బట్టలు మార్చుకొని తిరిగివచ్చాను - ఎందుకు తిరిగివచ్చాను ? గదిలో కూర్చుని లక్షణంగా చదువు కోక ? అతను అక్కడ ఉంటాడని తెలుసు. ఉండాలని మనసు లోపలిపొరల్లో గాఢమైన కోరిక. వెళ్ళిపోయి నన్నీ సందిగ్ధంలోంచి బయటు పారెయ్యాలని ఆశ.

ఆ తరువాత బైప్లేన్‌లో విహారం, అతని పక్కన కూర్చుని. మబ్బుల్లో తేలిపోతూ, కింద గంగనీ, ఔరంగజేబు స్తంభాలనీ, అర్ధ చంద్రాకారపు యూనివర్సిటీ ఆవరణనీ చూస్తూ, మొగం మీద మొత్తుతున్న గాలికి హాయిగా ఉక్కిరి బిక్కిరి అయిపోతూ.

అలహాబాద్ రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి. పరీక్షపోవడం - రాజా ఉద్యోగం పోవడం - పైలట్లకి విమానాలు నడపడం నేర్పకుండా ఒక ఆడపిల్లతో, ఫ్లైయింగ్ క్లబ్‌వాళ్ల పెట్రోలు ఖర్చుతో రోజల్లా తిరగడం మూలంగా. ఆ తరువాత మద్రాసు తిరిగిరాక.

అతనికి మద్రాసు ఫ్లైయింగ్ క్లబ్‌లో ఉద్యోగం వచ్చింది. ముఖం చిట్లించుకున్న నాన్నగారు ఆఖరికి నిట్టూర్చి చిరునవ్వు కూడా నవ్వి మా ఇద్దరినీ ఇంగ్లీషులో ఆశీర్వదించారు.

మబ్బుని చీల్చుకుని పోవడానికి ప్రయత్నిస్తూ విమానం చటుక్కుని కిందకి పడిపోయి మళ్లీ లేచింది. పెద్ద ట్రేల దొంతర పట్టుకొస్తున్న హొస్టెస్, తాగిన మనిషిలాగ ఒక ప్రయాణికుడి ఒడిలో పడబోయింది. పడిపోతే పట్టుకోడానికో, తీరా పడకపోతే ఒళ్ళోకి లాక్కోడానికో ఆ పెద్దమనిషి చేతులు చాపాడు. నీ ఎత్తు నాకు తెలుసనో, పడబోయినందుకో పడకపోయినందుకో క్షమార్పణగానో హొస్టెస్ చిరునవ్వు నవ్వింది. అతని ముందు వాల్చిన చిన్న బల్ల మీద ఒక ట్రే పెట్టింది.

నేను ఏమీ వద్దన్నట్టు, వాల్చినబల్ల పైకి ఎత్తేశాను. 'లెమన్ జ్యూస్ తెచ్చిపెట్టనా' అంది, నాకేదో వికారంగా ఉందనుకుని. వద్దని చల్లని చిరునవ్వుతోనే సూచించాను. 'వెర్రి తల్లీ! నీ మొగుడు ఎక్కడో దూరాన్న అకస్మాత్తుగా చచ్చిపోతే, నువ్వు ఏం తినాలేవు, తాగాలేవు!' అని చెప్పాలనిపించింది. ఆమెకు పెళ్లయిఉండదు. ప్రియులు ఉండొచ్చు. కాని ఏ ప్రియుడూ భర్త కాడు. ఒకవేళ అయినా తరవాత ప్రియుడుగా ఎక్కువకాలం ఉండలేడు. 'వెర్రి తల్లీ! మీరంతా పెళ్లిచేసుకోడానికి హక్కు కావాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నారట. నా మాట నమ్మండి. భర్తకన్న ప్రియుడే నయం. వయసు మళ్లాక భర్త అవసరం కనబడొచ్చు. అంతవరకు ఎందుకు జీవితాన్ని ఇరుకుల్లో పెట్టుకోవాలి?' ఆ హొస్టెస్‌ని పక్కని కూర్చోపెట్టుకుని ప్రభుత్వంవాళ్ళు పెళ్లిచేసుకోకూడదని ఆంక్ష విధించడం వాళ్ళ మంచికేనని బోధించాలనిపించింది. ఆ కోరిక

తీవ్రమై పొత్తికడుపు పేగుల్ని పట్టేసింది. ముందు సీటుమీద నుదురు వాల్చి కూర్చున్నాను. నా పక్కనున్న పెద్దమనిషికి నిజంగానే గాభరా ఎత్తింది. ధైర్యంచేసి అడగలేని నాగరికత, సంస్కారం. హెూస్టెస్‌ని పిలవాలని, విమానంలో ఎవరన్నా డాక్టరుంటే వచ్చి చూడమనాలని అతను పడుతున్న తహతహ అతని చేతివేళ్ళ అస్థిరత్వంలో, మోకాళ్ళ అప్రయత్న చలనంలో నాకు అవగతమైంది. "నాకేం కాలేదండి. ఏదో ఆలోచిస్తున్నాను. అంతే" అని ఆయనకి ధైర్యం చెప్పాను, సీట్లో వెనక్కి జేర్లబడి చిరునవ్వు నవ్వుతూ. అబ్బే ఏమీలేదు, ఒక చిన్న అవాంతరం జరిగింది. మా ఆయన అకస్మాత్తుగా నిన్న రాత్రి చచ్చిపోయాడు. అంతే, ఏమంత పెద్ద విషయం కాదు. ఇదంతా మాటల్లో పెడితే భయంకరంగా ఉంటుంది. ఆ ఆసామీకి. అంచేత చిరునవ్వులోనే ఇదంతా సూచించాను.

ఇంకా నలభై నిమిషాలు. ప్లేన్‌లోంచి దూకిపోవాలన్నా వీల్లేదు. ఈ నలభై నిమిషాలూ, నలభై గంటలుగా యుగాలుగా పరుచుకున్నా, ఏం చేయలేను. వేచి ఉండవలిసిందే.

వేచి ఉండడం, అతనికోసం వేచి ఉండడం భార్యగా నా జీవితంలో ముఖ్య భాగం. ఎనిమిదింటికి వస్తానన్న మనిషి, టాజ్‌లో డిన్నర్ అని చెప్పిన మనిషి. పది లేదు, పన్నెండు లేదు, తెల్లవారగట్ల మూడు గంటలకి వొస్తే, ఆకలి కడుపుతో నిద్రనటిస్తున్న నన్ను పలకరించనైనా పలకరించక పక్కని పడుకొని నిద్రపోతే, నాకు కసితో ఆకలితో నిద్రపట్టక తల పగిలి పోతుంటే, గడిపిన రాత్రులు, గడవని నిమిషాలు, గంటలు, యుగాలు, గుండెల్ని లాగే ఆరాటం, తెల్లవారి అతను లేవాక ఒక్క కౌగలింతలో ఒక్క ముద్దులో దాన్నంతా తీర్చాలనే అతని తాపత్రయం, అప్పటికప్పుడు ఉపశాంతి కలిగినా, ఆ రాత్రి చేసిన చిన్నగాయం తిరిగి తిరిగి రేగడం, ఆ గాయం క్రమంగా మానేదాకా ఇద్దరం లోకాన్ని మరిచిపోయి తిరగడం, తిరిగి గాయం, తిరిగి మానడం, ఆగాయాలు మానిపోయినా మచ్చలు మాత్రం వాటిని గుర్తుచేస్తూ నాలోలోపల మిగిలిపోడం....

అతనికి ఇతర స్త్రీలతో అవసరమైనంతకన్న ఎక్కువ పనువుందని నాకు అనుమానంగా తెలుసు. నాకు తెలుసని రుజువుతో అతన్ని బోనులో నిలబెట్టి చెప్పాలని ఎన్నోసార్లు అనిపించినా, నేనా పని చెయ్యలేదు. ఒకసారి మాత్రం ఇంచుమించు అంత పనీ జరిగింది. నేను మా నాన్నగారింటికి వెళ్లి రెండు రోజులు ఉన్నాను, ఆయన షష్టిపూర్తికి. అమ్మ లేదుగదా, అందుకని. ఆ రోజుని రాజా కూడా వచ్చాడు. రాత్రి భోజనాలయాక మా ఇంటికి తిరిగి వచ్చేశాం. నైట్ గౌనులోకి మారి అతని పక్కని పడుకోబోయి, తలగడ సర్దడానికి తీశాను. కింద ఒక బ్రా. నేను దానివంక చూస్తున్నాను. అతను చూస్తున్నాడు. అతను నావంక చూశాడు. నేనతని వంక చూశాను. అతని కళ్లలో మెరుగు. చిన్న బెదురు. నన్ను దగ్గరగా తీసుకుంటూ "నువ్వే మరిచిపోయి ఉంటావు" అన్నాడు. అతన్ని రవంత దూరంగా నెట్టుతూ, "ఇది నా సైజుకాదు" అన్నాను. నేనన్న మాటల వెనక ఆరోపణ ఉందని అతను గ్రహించినట్టు ముఖంలోనూ చూపుల్లోనూ కనబడలేదు. కాని నిజం నాకు తెలిసిపోయిందని అతనికి తెలుసు. అతనికి తెలుసని నాకూ తెలుసు.

"బెనారస్‌కి వెడుతున్నాను. పరీక్షకి కట్టాను."

"ఎందుకు ?"

"అప్పుడు పరీక్ష పోయిందిగా."

"పదేళ్ళ క్రితం. అయినా నీ కిప్పుడు డిగ్రీ ఎందుకు ?"

"ఎప్పటికైనా పనికిరావచ్చు."

అతనే ఏర్ టిక్కట్టు తెచ్చి ఇచ్చాడు, ఓపెన్ రిటర్న్. బయలు దేరే ముందు రోజు సెలవు పెట్టాడు. రాత్రీ పగలూ నాతో గడిపాడు ఊరంతా తిరిగాం. అర్థంలేని షాపింగ్, పదిరోజుల వరకూ మళ్ళీ కలవం. కలయికకీ కలతలకీ కూడా అవకాశం ఉండదు. ఆ రోజంతా తన్ను గురించే చెప్పుకున్నాడు. తను అవివేకి. స్వార్థపరుడు. తన మనసు చంచలం, నిగ్రహం అసలు లేదు. దిక్కు తెలీకుండా పోతున్న అతని జీవితంలో నేను చుక్కానిలాగ వచ్చాను. ఇద్దరం కలిసి

కట్టుకున్న ఇల్లు, కలిసి ఉన్న గడియలు, అవే అతని జీవితంలో నిలకడకు చిహ్నాలు. పది రోజులూ నాకోసం తపస్సు చేస్తాడు. నేలమీద పండుకుంటాడు. మంచినీళ్లు తప్ప మరేమీ తాగడు. డ్యూటీ, ఇల్లూ. మరో చోటికి పోడు. ఇదంతా చెపుతుంటే చంటి వాడిలాగా అనిపించాడు. నా కళ్లు చెమ్మగిల్లాయి.

నన్ను ప్లేన్ ఎక్కిస్తూ "అవునూ - మనం పిల్లలొద్దని ఎందు కనుకున్నాం?" అని నన్నడిగాడు!! తనే వద్దన్నది. "చంటిపిల్లలుంటే సరదా పోతుందన్నాడు. మాత్రలు అతనే కొనుక్కొని వచ్చాడు. "నువ్విల్లా ఎక్కడికన్నా వెడితే నాకెలాగ కాలం గడుస్తుంది? ఒక పిల్లో పిల్లాడో పుట్టి ఉంటే, వాళ్ళతో గడిపేసేవాణ్ణి" అన్నాడు. ఇప్పుడు మాత్రం మించిపోయిందేముంది? "నాకు ముప్పై, నీకు ముప్పైరెండు" అన్నాను ప్లేన్ ఎక్కుతూ, చటుక్కున దిగి పోవాలనిపించింది. పరీక్ష ఎందుకనిపించింది. ఆ రోజునుంచి మాత్రలు మానేసి, ఏడాది తిరక్కుండా చంటిబిడ్డ నెత్తుకోవాలని చెప్పరాని ఆత్రం. ప్లేన్ గుమ్మంలోనే నిలబడ్డాను. నిచ్చెన లాగేస్తున్నారు. దూకేద్దామన్నంత ఆత్రం. తలుపులు మూసేశారు. నా సీటు దగ్గరకు పరుగెత్తి చిన్ని కిటికీలోంచి చెయ్యి ఊపాను. అతనూ ఊపాడు. ఆ చెయ్యి ఊపడంలో ఒకరికొకరం ఎన్నో వాగ్దానాలు చేసుకున్నాం.

ఇప్పుడింక ఆ వాగ్దానాల్లో ఒక్కటీ నిలుపుకోలేనంత దూరం ఏర్పడిపోయింది మా ఇద్దరి మధ్యా -

చటుక్కుని పడిపోతున్నాను. నా కాళ్ల కింద ఏ ఆధారం లేనట్టు, నాకింద సీటే లేనట్టు. ప్లేన్ దిగుతోంది. Zero gravity ని గురించి రాజా చెప్పాడు. ఎన్నోసార్లు. ప్రదర్శించి చూపించాడు కూడా. విమానం దిగిపోతుంటే ఒళ్లు అతి తేలికైపోతుంది, అసలు ఈ శరీరం ఈ మనిషి అంతా అబద్ధమన్నట్టు, మనసుకూడా కాళీ అయిపోతుంది, ఊహల బరువు కూడా ఉండదు. దూదిపింజ, హంస తూలిక. ప్లేన్‌ని ఇటూ అటూ నిశ్చలంగా వేలాడుతున్న మబ్బుల

కొండలు. అలా గాలిలో నిలిచిపోతే ఎంత బాగుంటుంది! కదలిక లేకుండా. కలతలు లేకుండా. కాని మబ్బులకీ కలత లొస్తాయి ఒకొక్కప్పుడు. అప్పుడవి ప్రళయంగా ఉరుముతాయి, మెరుస్తాయి. ఒక్కుమ్మడిగా కరిగి, నీరై, గుండె బరువెక్కి, నేలమీదికి కుండ పోతగా పడిపోతాయి.

ప్లేన్ చక్రాలు నేలని తాకగానే నా బరువు నాకు అమితంగా తెలిసొచ్చింది. ముందుకు వెయ్యి టన్నుల బరువుతో పోబోతుంటే, బెల్టు నన్ను సీటుకి బంధించి ఆపింది. పొత్తికడుపులో పేగులు విపరీతంగా ఉంగలు చుట్టుకుపోయాయి. ఒక్క విమానవేగానికే కాదు. విమానం ఆగింది. పేగుల్లో ఒత్తిడి తగ్గింది: గాలిలో చలనం లేకుండా కూచున్న మబ్బు కొండలాగ తేలిగ్గా సీటులో కూచు న్నాను. ఇంచుమించు అందరూ దిగిపోయేదాకా బెల్టు విప్పలేదు. ఇంక హొూస్టెస్‌కి మరికాస్త ఆందోళన ఎందుకు కలిగించాలని. విప్పి లేచాను. కాళ్లు, మనసు అతి తేలికబడిపోయాయి. మెట్లు దిగు తుంటే హొూస్టెస్ అనుమానంగా చిరునవ్వు నవ్వి దండం పెట్టింది. మెట్లకి రవ్వంత దూరంలో నాన్నగారు, డా॥ నటరాజన్. కళ్లు తిరిగాయి, కాళ్లు తడబడ్డాయి. నాన్నగారు గబగబ మెట్లెక్కారు. నన్ను దగ్గరగా తీసుకున్నారు. ఆయన భుజంమీద తల వాల్చి ఏడ్చినట్టు నటించాను. కడుపులో ఉన్న శూన్యంలోంచి కన్నీళ్లు కూడా రాలేదు. ఈలోగా అందరికీ అర్థమైంది, నేను రాజా భార్య నని - హొూస్టెస్‌లకి, పైలట్లకి, ఇతర ఏర్‌పోర్ట్ ఉద్యోగులకీ ముందే తెలును. నాన్నగారు, డా॥ నటరాజన్ వచ్చారుగా. నాకోసం కారు మెట్లదాకా వచ్చింది. అందులో ఎక్కాం. నాన్నగారూ నేనూ వెనక సీట్లో, డా॥ నటరాజన్ ముందు సీట్లో. వెనక అద్దంలోంచి వెనక్కి తిరిగిచూశాను. హొూస్టెస్ బిత్తరపోయి పైలట్‌తో అంటున్నట్టుంది "అంచేతే కాబోలు, పాపం అలా ఉంది. మిసెస్ రాజా అని నాకు తెలియనే తెలియదు." తెలిస్తే ఏం చేసేదో!

పోర్టికోమీద వుడ్‌రోజ్ అడవిలా అల్లుకుపోయింది, పిచ్చిగా. మూలగా రాజాకి ఇష్టంలేకపోయినా, నేను కావాలని పట్టుబట్టి వేసి పెంచుకున్న ములగచెట్టుకి గొంగళి పురుగు పట్టింది. కారు ఆగ్గానే విపరీతంగా కళ్ళు తిరిగాయి. నాన్నగారు చెయ్యి ఊత ఇచ్చారు. దిగాలని లేదు. లోపలికి వెళ్లాలని లేదు. వెంటనే వెనక్కి తిరిగి ఏర్‌పోర్ట్‌కి వెళ్లిపోయి, ఢిల్లీ-బెనారస్-పూర్తి చెయ్యని పరీక్షలు....

హాల్లో తన అలవాటైన దివాన్‌మీద పడుకున్నాడు రాజా, చుట్టూ డ్రైఐస్. మీదవేసిన పువ్వుల దండ రంగులతో సహా గడ్డ కట్టుకుపోయింది. ఎదురుగా గోడమీద సజీవంగా నవ్వుతున్న అతని ఫోటో. దివాన్ మీద శాశ్వతంగా బిగుసుకుపోయిన అతని మూర్తి. దగ్గరగా వెళ్ళబోతుంటే నాన్నగారు పట్టుకున్నారు. సోఫాలో కూర్చోపెట్టారు. డాక్టర్ నటరాజన్ నాకూ రాజాకి మధ్యగా నిలబడ్డాడు, అతన్ని కాపాడ్డానికి లాగ. ఆయన వంక కన్నెత్తి చూశాను.

"పోస్ట్‌మార్టెం చెయ్యాల్సి వచ్చింది."

"హార్ట్ అటాక్ కాదా?"

"అదే. అయినా కొన్ని అనుమానించడానికి వీలయిన కారణాల మూలంగా...."

బొమలు ముడివేసి చూశాను. అప్పుడు కనిపించాడు, సర్కిల్ ఇన్స్పెక్టర్ రహంతుల్లా. వివరాలు అడగలేకపోయాను. బెడ్‌రూం లోకి వెళ్లాను. ఆ డబుల్ బెడ్‌మీద కూర్చోవాలనిపించలేదు. బాత్‌రూంలోకి వెళ్లి టబ్ నింపాను, మరుగు నీళ్లతో. నాన్నగారి ఆత్రం, నేనేం చేసేస్తానో అని. మరేం ఫరవాలేదన్న హామీ చిరునవ్వుతో అందించి. బాత్‌రూం తలుపు మూశాను. మరుగునీళ్లలో అలాగే పడుకున్నాను, కొన్ని గంటలు. నాన్నగారూ వాళ్లూ ఎలక్ట్రిక్ క్రిమెటోరియం నించి తిరిగి వచ్చేదాకా.

సాయంత్రం నాలుగున్నర. రహంతుల్లా వచ్చాడు. ఎలా చెప్పాలో తెలియక తికమకపడిపోయాడు. రాజా బాత్‌రూం

గుమ్మం దగ్గర పడిపోయి ఉన్నాట్ట. తోటమాలి ఫోన్‌చేస్తే డాక్టర్ నటరాజన్ వచ్చి చూశాట్ట. అప్పటికే పోయి నాలుగయిదు గంటలయి ఉండాలి. అంటే తెల్లవారక ముందే, ఏ మూడు గంటలకో జరిగుండాలి. కాని, చిత్రం.... దొడ్డి తలుపు తెరిచుంది. తోటమాలి ఆ దారినే లోపలికొచ్చాట్ట. అనుమానం వచ్చి డాక్టర్ తనకి ఫోన్ చేశాడు. తను వచ్చి అంతా పరీక్ష చేశాడు. మంచం కింద ఈ పెట్టి పడి ఉంది. ఈ బిల్లూను. బిల్లు ఆరువందల ఏభయిరెండు ముప్పైఆరు పైసలు. నెక్‌లేస్ ఉండవలసిన పెట్టె కాళీ. అందుకని ముందు నౌకర్లని ప్రశ్నించవలసొచ్చింది.... నెక్‌లేస్ దొరికింది. పనిమనిషి తలుపులు మెళ్లోనే ఉంది, దాని యింటో. దొంగతనం, హత్య అయుండవచ్చు. అందుకని పోస్ట్‌మార్టెమ్ చెయ్యవలిసొచ్చింది.... కాని తలుపులు అది ఆయనే తనకి ఇచ్చారంటుంది. బంగారంది కాదు, గిల్టుదంటుంది. ఆయనే చెప్పారంటుంది. కాని షాపులో వాకబుచేస్తే అది 14 కారట్ బంగారందట. మొన్న రాజా కొన్నాట్ట. తలుపులు మీద కేసు పెట్టొచ్చు, ఆమె రిపోర్ట్ చేస్తే. తను అరెస్టు చేస్తాడు. కాని....

నేను లేచి పడకగదిలోకి వెళ్లిపోయాను. టేబిల్‌మీద రాజా ఫోటో, మైసూరులో కొన్న దంతపు ఫ్రేమ్‌లో. అతనితో చర్చించాను, మౌనంగానే. కేసు కోర్టుకి వెడితే తలుపులు తప్పకుండా చెపుతుంది. ఆ రాత్రి రాజా తన్ను పిలిపించాడని, రాత్రి తనతో గడిపాడని, తనే ఆ నెక్‌లెస్ ఆమెకు ఇచ్చాడని. అదే నిజమై ఉంటుంది. ఇంతవరకు నేను ఊహించని నిజం. ఏ ఎర్‌హోస్టెస్సో, ఏ టెలిఫోను ఆపరేటరో అయితే అర్థం చేసుకోవచ్చు. తలుపులా! అంత దిగజారిపోయాడా రాజా? కాదు, నన్ను దిగ జార్చాడు, తలుపులు స్థాయికి. తలుపుల్లాగే నేనూ ఒక ఆడదాన్ని. అతనికి సంబంధించినంతవరకు అంతే. అంటే, డబ్బు హోదా, ఇల్లు, ఫర్నిచరు, తోట, దొడ్డి, వీటిలో తలుపులుకి భాగం లేదు, నాకున్నట్టు. కాని డబుల్‌బెడ్ మీద మాత్రం, నేనెంతో తలుపులూ అంతే.

తల తిరిగింది. ఒళ్లు తూలింది. మంచం మీద కూర్చో బోయాను. ఆ మంచం మీద కూర్చోలేకపోయాను. ఒక రాత్రి - నాకు తెలీకండా ఎన్నిరాత్రులో - తలుపులు పంచుకున్న ఆ మంచంమీద. డ్రెసింగ్ టేబిల్ ముందు కూర్చున్నాను.

మెల్లగా తలుపు తెరుచుకుని తలుపులు లోపలికొచ్చింది. బెదురుతూ తలుపు మూసింది. చూశాను. చీర మోకాలిపైకి విరిచి కట్టింది. కింది తొడలు పిక్కలు-సున్నగా బలంగా, నల్లగా నిగనిగ లాడుతూ. రైకలో ఇమడలేక ఇమిడిన రొమ్ములు. బెదురు కళ్లు. మెల్లగా, లేచాను. నెక్‌లేస్ ఆయనే ఇచ్చారు గనక అది తనదేనన్నాను. దాని తాలూకు పెట్టి కూడా తన దగ్గరే ఉండడం న్యాయమన్నాను. అది తనకా నెక్‌లేస్ అక్కర్లేదన్నట్టు డ్రెసింగ్ టేబిల్ మీద పెట్టింది.

"గిల్టుదని అబద్దవా(డేడు రాజాబాబు. బంగారందని నాకు తెల్దు. రేత్తిరి....అద్ద రేతిరి దాటింది. ఇంకెళ్లి పోతానన్నా. దొడ్డి తలుపు తనేసుకుంటానన్నాడు. .... ఇట్టా.... అందర్నీ అన్నాయం జేత్తాడని...."

ఇంక మాట్లాడలేక భోరుమంది తలుపులు. అనుకోకుండా నా చేతులు ఆమెను దగ్గరగా తీసుకున్నాయి. ఏడుపు కట్లుతెంచుకుని వొస్తుంటే, తలుపులు నన్ను ఓదార్చిందో నేనే తలుపుల్ని ఓదార్చానో. ఇంక రాజా తలుపులుకీ లేడు నాతోపాటు. బతికుండగా నన్ను తలుపులు స్థాయికి దించేశాడు. పోయాక తలుపుల్ని నా స్థాయికి తీసుకొచ్చాడు.

మా ఇద్దరికీ, ఇంకెందరికో, దూరమైపోయాడు రాజా-కొలవ రానంత దూరం.